క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తొండంగి: మండలంలోని బెండపూడి జాతీయ రహదారిపై బైకును కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. తొండంగి ఎస్సై జగన్మోహన్ రావు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలో పి.ఇ.చిన్నాయపాలేని చెందిన గిడుతూరి కాశీశివరామకృష్ణ (37) పైడికొండ పంచాయతీ ఆనూరు గ్రామానికి చెందిన ఇందుగపల్లి శ్రీను ధర్మవరం నుంచి తుని బైకుపై వస్తుండగా బెండపూడి జాతీయ రహదారిపై పోలవరం కాలువ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో బైకు నడుపుతున్న శ్రీను, వెనుక కుర్చున్న శివరామకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శివరామకృష్ణ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గృహోపకరణాలు ధ్వంసం

గోకవరం: గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పలు ఇళ్లల్లోని గృహోపకరణాలు దెబ్బతిన్నాయి. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారి చెంత ఉన్న ఓ భవంతిని శనివారం జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ క్రమంలో భవనం శిథిలాలు సమీపంలోని విద్యుత్ తీగలపై పడటంతో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యింది. 12వ వార్డులోని పలు ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్‌లు, మిక్సీల వంటి విద్యుత్ గృహోపకరణాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో స్థానికులు ఆందోళనకు దిగారు. విద్యుత్ శాఖ అధికారులకు కనీసం సమాచారం ఇవ్వకుండా శిథిలాలు తొలగించడంతో ఈ పరిస్థితి తలెత్తిందని స్థానిక వార్డు సభ్యుడు చిటికెల పాండు ఆరోపించారు. బాధితులకు సంబంధిత వ్యక్తులు నష్ట పరిహారం చెల్లించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

క్వారీ కార్మికుల ఆందోళన

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రధాన రహదారిపై శనివారం క్వారీ కార్మికులు ఆందోళన నిర్వహించారు. వేతనాల పెంపు కోరుతూ కార్మికులు చేస్తున్న సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉభయ గోదావరి జిల్లాల క్వారీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుప్పాల నాగభూషణం మాట్లాడుతూ కార్వీ యజమానులకు అనేక సార్లు వేతనాల పెంపుపై గడువు ఇచ్చినా సానుకూలంగా స్పందించకపోవడంతో సమ్మె చేపట్టామన్నారు. రెండేళ్లకొకసారి వేతనాలు పెంచేందుకు క్వారీ యజమానులు ముందుకు రావాలన్నారు. తమ వేతనాలు పెంచుతూ నూతన అగ్రిమెంట్ చేసే వరకూ సమ్మె కొనసాగుతుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దేరంగుల రాజు, వేముల నాగరాజు, నీలి సుబ్బారావు, నేపా శివ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

కోటనందూరు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు నుంచి కొంతమూరు హైవేపైకి వస్తున్న పాస్టర్ ప్రవీణ్ మృతి పట్ల క్రైస్తవ సోదరులకు పలు అనుమానాలు ఉన్నాయన్నారు. పాస్టర్‌ది యాక్సిడెంట్ కాదని, హత్య అనే అభిప్రాయాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీసీ ఫుటేజీలు, పోస్టుమార్టం రిపోర్టులు బయట పెట్టి క్రైస్తవుల అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు.

జాబ్ మేళాలో 498 మందికి ఉద్యోగాలు



జాబ్ మేళాలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని: స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో వికాస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 498 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని వికాస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. జాబ్ మేళాను ఎమ్మెల్యే యనమల దివ్య ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 600 మంది హాజరు కాగా 498 మందికి దివ్య నియామక పత్రాలను అందజేశారు. తునికి చెందిన యువకుడు రూ.10 లక్షల ప్యాకేజీతో డిలైట్ క్రాప్ ఇన్నోవేషన్ కంపెనీలో ఉద్యోగం పొందడం ఆనందంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

తుని/ఏలేశ్వరం/జగ్గంపేట: టీడీపీ ఆవిర్భావ వేడుకలను శనివారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని గ్రామాల్లో నిర్వహించారు. తుని సీతారాంపురంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఆవిష్కరించారు. సాయినగర్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే, విప్ యనమల దివ్య జెండాను ఆవిష్కరించారు. ఏలేశ్వరం మెయిన్‌రోడ్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పైల సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్గంపేటలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే పార్టీ జెండా ఎగుర వేసి కేక్ కట్ చేశారు.

ఊరూరా జాతర

- కన్నులపండువగా నూకాలమ్మ పండగ
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



పెద్దిపాలెంలో ఆకట్టుకున్న శక్తివేషాలు



గోకవరంలో కనకదుర్గమ్మకు జలాభిషేకం

ఏలేశ్వరం: కోరిన కోర్కెలు తీర్చే గ్రామ దేవత నూకాలమ్మ అమ్మవారి తీర్థం లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లో శనివారం ఘనంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులతో ఆలయం కళకళలాడింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. కాగా శుక్రవారం రాత్రి అమ్మవారి అలయాల వద్ద జాతర నిర్వహించారు. జాతరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

తుని రూరల్: కొత్త అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని గ్రామాల్లో నూకాలమ్మతల్లి సంబరాలు వైభవంగా జరిగాయి. పల్లెలోని అమ్మవారి ఆలయాల వద్ద శుక్రవారం రాత్రి జాతర నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించి, మొక్కులు తీర్చుకున్నారు. జాతరోత్సవాలను పురస్కరించుకుని డి.పోలవరం, రేఖవానిపాలెం, తేటగుంట, హంసవరం, కేఓ.మల్లవరం గ్రామాల్లో సాంస్కృతిక, జానపద, శక్తివేషాలు ప్రదర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కిర్లంపూడి: కొత్త అమావాస్యను పురస్కరించుకుని కిర్లంపూడిలో వేంచేసిన నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం సతీమణి పద్మావతి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థంలో ఏర్పాటు చేసిన బొమ్మలు, స్వీట్స్ దుకాణాలు కిటకిటలాడాయి. గరగల నృత్యం, బాణసంచా కాల్పులు భక్తులను ఆకట్టుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో నూకాలమ్మ తల్లి వేడుకలు

తుని: కోరిన కోర్కెలు తీర్చే నూకాలమ్మతల్లి పండుగ శనివారం వైభవంగా జరిగింది. పట్టణంలోని పాత బజారువీధిలోని నూకాలమ్మతల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు.ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం, ఒమ్మంగి, ధర్మవరం గ్రామాల్లో నూకాలమ్మ జాతర మహోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. పెద్దిపాలెంలో నూకాలమ్మతల్లి జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శక్తివేశాలు, కోలాటం, తప్పెటగుళ్లు, సువ్వారాట తీన్‌మార్, బుర్రకథ, గరగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దిపాలెం, పరిసర గ్రామాల భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి జాతరను ఆసక్తిగా తిలకించారు. ఒమ్మంగి, ధర్మవరం గ్రామాల్లో నూకాలమ్మతల్లిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

రౌతులపూడి: కొత్త అమావాస్య సందర్భంగా మండలంలోని ఎస్.పైడిపాల, రౌతులపూడి, ఎ.మల్లవరం తదితర గ్రామాల్లో నూకాలమ్మ జాతర నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, తప్పెటగుళ్లు, గరగల నృత్యాలు వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



కిర్లంపూడిలో నూకాలమ్మను దర్శించుకుంటున్న ముద్రగడ గిరిబాబు, భక్తులు



డి.పోలవరంలో విశేష అలంకరణలో అమ్మవారు

శంఖవరం: మండలంలోని కత్తిపూడి, శంఖవరం, మండపం, జి.కొత్తపల్లి గ్రామాల్లో నూకాలమ్మ జాతర, తీర్థం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శంఖవరంలో తీర్థ మహోత్సవం నిర్వహించారు. జి.కొత్తపల్లి, గౌరంపేట, అచ్చంపేట, శృంగవరం, మెరకచామవరం తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి తీర్థంలో సందడి చేశారు. ఆలయాల వద్ద అన్నవరం పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు.

108 బిందెలతో జలాభిషేకం

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మకు శనివారం 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. కొత్త అమావాస్య తిథిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో మహిళలు తమ ఇళ్లల్లోంచి బిందెలతో నీళ్లు తీసుకువచ్చి అమ్మవారిని అభిషేకించారు.

తొండంగి: కొత్త అమావాస్య పండుగ సందర్భంగా తొండంగి, శృంగవృక్షం గ్రామాల్లో నూకాలమ్మ, పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన మహిళలు అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, తప్పెటగుళ్లు, తీన్‌మార్, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సంపదాయ నృత్యాలు నిర్వహించారు. ఎ.కొత్తపల్లి, సీతారాంపురం, కొమ్మనాపల్లి, రావికంపాడు తదితర గ్రామాల్లోని నూకాలమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుబ్బాలమ్మ జాతర ప్రారంభం

గోకవరం: గ్రామదేవత గుబ్బాలమ్మ జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి గ్రామస్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ ఆచంట రాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఎవరికివారే యమునా తీరే...?

- టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో బయటపడిన వర్గపోరు
- దానవాయిపేటలో రెండు జెండాలు ఎగురవేసిన నేతలు



దానవాయిపేటలో రహదారికి ఇరువైపులా రెండు వర్గాల వారు విడివిడిగా ఎగురవేసిన టీడీపీ జెండాలు

తొండంగి: టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో ఆ పార్టీ నేతల మధ్య వర్గపోరు బయటపడింది. మండలంలోని దానవాయిపేటలో టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి ఎదురెదురుగా పార్టీ జెండాలు ఎగురవేయడం చర్చనీయాంశమైంది. దానవాయిపేటలో దీర్ఘకాలం నుంచి టీడీపీలో ఉన్న చొక్కా బుల్లబ్బాయి వర్గం, ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన చొక్కా కాశీవిశ్వేశ్వరరావు వర్గాల మధ్య ఆధిపత్యపోరు నెలకొంది. ఈ నేపథ్యంలో ఎవరికి వారే జెండా దిమ్మలను ఏర్పాటు చేసి పార్టీ ఆవిర్భావ వేడుకలను విడివిడిగానే నిర్వహించారు. కాగా మండలంలోని కృష్ణాపురంలో నిర్వహించిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో పార్టీ జెండాను తిరగేసి ఎగురవేశారు. దీంతో సైకిల్ జెండా తిరగబడిందంటూ సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు చక్కర్లు కొట్టాయి.



కృష్ణాపురంలో తిరగేసి ఎగురవేసిన సైకిల్ జెండా

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



తిరుచ్చి వాహనంపై సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగిస్తున్న పండితులు, భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం వైభవంగా జరిగింది. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి అర్చకస్వాములు పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కొబ్బరికాయ కొట్టి ప్రాకారసేవ ప్రారంభించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ మూడు సార్లు ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. అనంతరం పండితులు స్వామి, అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

స్వామివారిని దర్శించిన 20 వేల మంది

రత్నగిరిపై సత్యదేవుని శనివారం సుమారు 20 వేల మంది భక్తులు దర్శించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు 800 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.15 లక్షలు ఆదాయం సమకూరింది. అన్నదాన పథకంలో మూడు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు. ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా రత్నగిరి పై భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది.

ఉద్యోగ, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా సోమినాయుడు

తుని: వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ ఉద్యోగ, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా లక్కాల సోమినాయుడును నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తనకు నియోజకవర్గ స్థాయి పదవి దక్కిందని సోమినాయుడు తెలిపారు. ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీపరంగా గుర్తింపు ఇచ్చిన మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు.

నవోదయకు విద్యార్థి ఎంపిక



సిరికి నిహాల్

ప్రత్తిపాడు: జవహర్ నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రత్తిపాడు మినర్వా స్కూల్ విద్యార్థి సిరికి నిహాల్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్ఎం మల్లికార్జున్ శనివారం తెలిపారు. నవోదయకు ఎంపికైన సిరికి నిహాల్‌ను పాఠశాల డీన్ ఆనందకుమార్ జోషి, లక్ష్మణ్‌కుమార్ అభినందించారు.

పదో తరగతి పరీక్ష వాయిదా

ప్రత్తిపాడు: ఈ నెల 31న జరగాల్సిన పదో తరగతి పరీక్ష ఏప్రిల్ 1వ తేదీకి వాయిదా పడినట్టు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు. 31న రంజాన్ పండగ నేపథ్యంలో ప్రభుత్వం సెలవు ప్రకటించిందన్నారు. ఆ రోజు జరగాల్సిన పదో తరగతి సోషల్ స్టడీస్ (సాంఘిక శాస్త్రం) పరీక్ష ఏప్రిల్ 1న జరుగుతుందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని ఎంఈఓ కోరారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: అమావాస్య పర్వదినం సందర్భంగా రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శనివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు యనమండ్ర శర్మ, అర్చకుడు దత్తాత్రేయశర్మ, పరిచారకుడు వేణు, వ్రతపురోహితులు దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. పది మంది భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొన్నారు.

మొక్కుబడిగా కౌన్సిల్ సమావేశం

తుని: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించిన కౌన్సిల్ సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం తాత్కాలిక చైర్‌పర్సన్ కుచ్చర్లపాటి రూపాదేవి అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన అంశాలపై ఎటువంటి చర్చ లేకుండా మూజువాణి పద్ధతిలో సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలకు సంబంధించిన జీరో అవర్‌ను రద్దు చేశారు. దీంతో వార్డుల్లో ఉన్న సమస్యలు ప్రస్తావనకు రాలేదు. వేసవిలో ప్రజలకు మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు అంశం తప్ప ప్రధాన అంశాల జోలికి పోలేదు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉగాది వేడుకలకు సర్వం సిద్ధం

ప్రత్తిపాడు: ఉగాది వేడుకలకు సర్వం సిద్ధమైంది. శ్రీక్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ తెలుగు నూతన సంవత్సరాది శ్రీవిశ్వావసు ఉగాదికి స్వాగతం పలికేందుకు నియోజకవర్గంలోని గ్రామాలు ముస్తాబయ్యాయి. ఆదివారం నియోజకవర్గంలోని ప్రతి పల్లెలో ఉగాది సంబరాలు చేసుకోనున్నారు. ఇప్పటికే దేవాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు చేశారు. ప్రజలు ఉగాది పచ్చడికి కావలసిన సామగ్రిని సిద్ధం చేసుకున్నారు.

కనిపించని సందడి

తెలుగు ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకునే ఉగాది పండుగకు ఈఏడాది కొంచెం కళ తప్పిందనే చెప్పాలి. వ్యవసాయం కలిసి రాకపోవడంతో గ్రామాల్లో పండుగ ప్రాభవం కోల్పోయింది. ఏటా పండగకు రెండు రోజుల ముందే గ్రామాల్లో పండగ హడావుడి కనిపించేది. చేతిలో సొమ్ము లేకపోవడంతో ఈ ఏడాది అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. సంత, దుస్తులు, నిత్యావసర దుకాణాలు వెలవెలబోతున్నాయి. ప్రభుత్వ పథకాలు చేతికి అందకపోవడం, నిత్యావసరాలు ధరలు ఆకాశాన్ని అంటుతుండడం, చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో గ్రామీణ ప్రజలు పండుగపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పండిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం కూడా పండుగపై ప్రభావం చూపింది.

రత్నగిరిపై నేడు ఉగాది వేడుకలు

అన్నవరం: రత్నగిరిపై శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించడానికి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం తొమ్మిది గంటలకు నూతన పంచాంగాలను స్వామివారి సన్నిధిలో ఉంచి అర్చకులు పూజలు చేస్తారు. 9.30 గంటలకు వేద పండితుడు గొల్లపల్లి వేంకటరామ గణపతి పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. అనంతరం ఉగాది పచ్చడి, స్వామివారి ప్రసాదం, దేవస్థానం పంచాంగాలను భక్తులకు పంపిణీ చేస్తారని అధికారులు తెలిపారు. కాగా ఉగాది వేడుకలను పురస్కరించుకుని ఇద్దరు పండితులను సత్కరించనున్నారు. రాజమహేంద్రవరానికి చెందిన ఉప్పులూరి సత్యనారాయణ అవధాని, పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరానికి చెందిన గుల్లపల్లి వేంకట నాగ శ్రీరామ అవధానులకు ఉగాది పురస్కారం కింద రూ. ఐదు వేల నగదు, శాలువా, స్వామివారి ప్రసాదాలతో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు సత్కరిస్తారు. వీరితో పాటు పంచాంగ శ్రవణం చేసిన గొల్లపల్లి వేంకటరామ ఘనాపాఠిని ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాకారంలో ఉదయం 11.30 గంటలకు రథంపైన, రాత్రి ఏడు గంటలకు అన్నవర పుర వీధుల్లో వెండి గజవాహనంపైన స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించనున్నట్లు తెలిపారు. ఉగాది వేడుకల సందర్భంగా అనివేటి మండపంలో ఉత్సవ వేదికను ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

జగ్గంపేట: మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లలో శనివారం ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. స్థానిక శెట్టిబలిజపేట రామాలయంలో వేడుకలు నిర్వహించి పిల్లలకు ఉగాది పచ్చడిని తినిపించారు.ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ ఉగాది విశిష్టతను పిల్లలకు వివరించారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



జగ్గంపేటలో దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 31 మంది దివ్యాంగ విద్యార్థులకు అలింకో సంస్థ ద్వారా మంజూరైన ఉపకరణాలను శనివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పంపిణీ చేశారు. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు వీల్‌చైర్లు, బ్యాటరీ సైకిళ్లు, ట్రై సైకిళ్లు, చెవిటి మెషీన్లను ఎమ్మెల్యే నెహ్రూ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, మండల ప్రత్యేక అధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ, ఎంఈఓ స్వామి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ అధికారులతో శనివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో చేపట్టిన గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

బీటెక్ పట్టాతో పాటు ఉద్యోగం



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ప్రో చాన్సలర్ సతీష్‌రెడ్డి, తదితరులు

గండేపల్లి: విద్యార్థులు బీటెక్ పట్టాను, ఉద్యోగాన్ని వెంట తీసుకుపోవచ్చని ఆదిత్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎస్.సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన ఎచీవర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువు పూర్తి చేసుకున్న పట్టాతో పాటు ఉద్యోగ నియామక పత్రాన్ని వెంట పట్టుకుని యూనివర్సిటీ గేటును ఆనందంగా దాటాలన్నారు. దేశ, విదేశాల్లో ఆదిత్య విద్యార్థులు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. విద్యార్థుల జీవితాలకు మంచి మార్గాలు చూపుతూ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది 2700 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. వీరిలో కొందరు అత్యుత్తమ వార్షిక వేతనం రూ.52 లక్షలు, రూ.45 లక్షలు, రూ.35 లక్షల ప్యాకేజీలతో ఉద్యోగాలు పొందినట్టు వివరించారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఫైనల్ ఇయర్ చదువుతూ పలు కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన ఆదిత్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ జి.సురేష్, ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్, టెక్నికల్ హబ్ సీఈఓ బాబ్జి నీలం, డీన్స్, తదితరులు పాల్గొన్నారు.

రూ.26.52 లక్షల హుండీల ఆదాయం



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారికి హుండీల ద్వారా రూ.26.52 లక్షల ఆదాయం సమకూరిందని లోవ దేవస్థానం ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపా రు. తంటికొండ, కరప గ్రూపుల టెంపుల్స్ కార్యనిర్వహణాధికారులు వి.సత్యనారాయణ, కె.రవితేజ పర్యవేక్షణలో దేవస్థానంలో హుండీలను శనివారం తెరచి, ఆదాయం లెక్కించారు. మొత్తం 45 రోజుల కు గాను కరెన్సీ నోట్లు రూ.24,98,395, నాణేలు రూ.1,54,120 కలిపి మొత్తం రూ.26,52,515 నగదు, 12.8 గ్రాముల బంగారం, 270 గ్రాములు వెండి లభించాయని విశ్వనాథరాజు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, చైతన్య గోదావరి బ్యాంకు అధికారులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి బాల కోటేశ్వరరావు

తుని: యువత చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మండల న్యాయ సేవాధికార సంఘం చైర్మన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి కె.బాలకోటేశ్వరరావు సూచించారు. తుని నోబుల్ ఐటీఐలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత ఆదేశాల మేరకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. మైనర్ బాల బాలికలు క్రమ శిక్షణతో మెలగాలని సూచించారు. యాసిడ్ దాడులు, శిక్షలు, నష్ట పరిహారం తదితర అంశాలపై యువతకు అవగాహన కల్పించారు. నోబుల్ ఐటీఐ ప్రిన్సిపాల్ జీవీవీ సత్యనారాయణ, తుని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సలుగు కృష్ణశేఖర్, ఎ.నరసింహామూర్తి, ఎస్సై కృష్ణమాచారి, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

గోకవరం: విద్యార్థులు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.జగదీశ్వరి అన్నారు. మండలంలోని వీరలంకపల్లి బాలికల గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థినులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. మేజిస్ట్రేట్ ముఖ్యఅతిథిగా పాల్గొని పోక్సో చట్టం గూర్చి వివరించారు. విద్యార్థినులకు చట్టంపై కలిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎస్సై పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ రాణి, ఇతర ఉపాధ్యాయులు, స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



జగ్గంపేటలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న తోట నరసింహం

జగ్గంపేట: స్థానిక జామా మసీదులో ముస్లిం సోదరులకు శనివారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం ఇఫ్తార్ విందు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు ఎంతో పవిత్రంగా ఆచరించే రంజాన్ వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. తొలుత ముస్లింలు ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లింలు గఫూర్, సలీం, వైఎస్సార్ సీపీ నేత తోట రాంజీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట మండల అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, పార్టీ జగ్గంపేట పట్టణ అధ్యక్షుడు కాపారపు ప్రసాద్, పార్టీ నేతలు కరుటూరి శ్రీనివాస్, రామకుర్తి జగాల్, కాపారపు ప్రసాద్, సప్పా రఘు, భూమాడ గణపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య సభ్యులకు శిక్షణ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఏపీఎం వెంకట్

ప్రత్తిపాడు: మొబైల్ అప్లికేషన్ ద్వారా డ్వాక్రా సంఘాల్లోని సభ్యుల వివరాలు పొందుపరచాలని వెలుగు ఏపీఎం వై.వెంకట్ సూచించారు. ప్రత్తిపాడులోని వెలుగు, విద్యాశాఖ కార్యాలయాల్లో రెండు బ్యాంచ్‌లుగా డ్వాక్రా సంఘల సభ్యులకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి రుణ ప్రణాళిక, జీవనోపాధుల ప్రణాళికపై శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం వై వెంకట్ మాట్లాడుతూ మండలంలో 1992 మహిళా సమాఖ్య సంఘాల్లో 20,120 మంది సభ్యులున్నారని చెప్పారు. వీరికి విడతలు వారీగా శిక్షణ ఇస్తామన్నారు. రుణ ప్రణాళిక, సభ్యుల ఆధార్ రిజిస్ట్రేషన్, సమావేశాలు, జియో పెన్సింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సీసీలు టి.శ్రీనివాస్, వై.శ్రీను రీసోర్సు పర్సన్లుగా వ్యవహరించారు. 150 మంది డ్వాక్రా మహిళలు హాజరయ్యారు.